క్లుప్తంగా

సాయిభక్తుల భిక్షాటన



భిక్షాటన చేస్తున్న సాయి భక్తులు

మద్దికెర : స్థానిక సాయినగర్‌లోని షిర్డి సాయి బాబా దేవాలయంలో ఈనెల 21న ఆదివారం గురుపౌర్ణమి పురస్కరించుకొని సాయి భక్తులు భిక్షాటన కార్యక్రమం చేపట్టినట్లు సాయిసేవా సమితి సభ్యులు తెలిపారు. గురువారం ముందుగా ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో గీతాలు ఆలపించుకుంటూ భిక్షాటన కార్యక్రమం చేపట్టారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

మద్దికెర : వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా గ్రామాల్లో పంచాయతీ సిబ్బందితో పారిశుద్ధ్య పనులు చేయించి దోమల నివారణ మందులు చల్లించాలని ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి సూచించారు. గురువారం పంచాయతీ కార్యదర్శులతో ఆయన మాట్లాడుతూ ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. క్లోరినేషన్ చేసిన నీటిని మాత్రమే సరఫరా చేయాలని ఆదేశించారు. అలాగే.. గ్రామాల్లో మురుగు నీటిని రోడ్లపై వదలకుండా చర్యలు చేపట్టాలని, ఇందుకు ప్రజలకు సహకరించాలన్నారు.

దుకాణాల అద్దె బకాయిలు చెల్లించాలి



రికార్డులు పరిశీలిస్తున్న బి.భూపతిరావు

పత్తికొండ రూరల్ : పెండింగ్‌లో ఉన్న షాపుల అద్దె బకాయిలు వెంటనే చెల్లించాలని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ క్రీడల అభివృద్ధి అధికారి బి.భూపతిరావు దుకాణదారులను కోరారు. గురువారంపత్తికొండలోని క్రీడావికాస కేంద్రం అథారిటీ ఆధ్వర్యంలోనున్న షాపులను ఆకస్మికంగా తనిఖీ చేసి అద్దె పెండింగ్‌లో ఉన్న దుకాణదారులకు నోటీసులు ఇచ్చి త్వరగా చెల్లించాలని, లేకపోతే దుకాణాలకు తాళాలు వేస్తామని హెచ్చరించారు. ప్రతినెలా 5వ తేదీలోపు అద్దె తప్పనిసరిగా చెల్లించాలని సూచించారు.

హంతకులను కఠినంగా శిక్షించాలి

ఆస్పరి:నందికొట్కూర్ మండలం ముచ్చుమర్రి గ్రామంలో బాలికను కిరాతకంగా చంపిన మానవ మృగాలను కఠినంగా శిక్షించాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ఆలూరు తాలూకా కార్యదర్శి మునిస్వామి డిమాండ్ చేశారు. ఆయన గురువారం ఆస్పరిలో విలేకరులతో మాట్లాడుతూ.. అభం శుభం తెలియని చిన్నారిపై ముగ్గురు మానవ మృగాలు అత్యాచారం చేసి హత్య చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని, మానవ మృగాలకు కఠినంగా శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మొహర్రం వేడుకలకు అనుమతి తప్పనిసరి



పీర్లచావిడి నిర్వాహకులతో మాట్లాడుతున్న ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు

హాలహర్వి: మండలంలో మొహర్రం వేడుకల్లో భాగంగా పీర్ల దేవుళ్లను ప్రతిష్ఠించే నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. ఈ మేరకు గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయా గ్రామాల్లోని పీర్లచావిడిల నిర్వాహకులు, గ్రామస్తులతో సీఐ సమావేశమై మాట్లాడారు. పీర్లదేవుళ్లను కూర్చోబెట్టే వారు పీర్లచావిడిల వద్ద ఎలాంటి ఘర్షణలు చోటు చేసుకోకుండా చూసుకోవాలన్నారు. ఏవైనా అల్లర్లు, గొడవలు జరిగితే మీరే బాధ్యులని హెచ్చరించారు. ప్రశాంతంగా మొహర్రం వేడుకలను జరుపుకోవాలని సూచించారు. ఎస్‌ఐ నరేంద్ర, పోలీసులు, పీర్లచావిడిల నిర్వాహకులు పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్‌ను పునః ప్రారంభించాలి


హొళగుంద: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి కేంద్రాన్ని పునఃప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ, సీఐటీయూ నాయకులు మల్లికార్జున, నాగరాజు కోరారు. ఈ మేరకు గురువారం హొళగుంద తహసీల్దారు ప్రసాద్‌రాజుకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. గతంలో హొళగుందలో ఉన్న ఎస్సీ హాస్టల్‌ను మూసివేశారని దీనివల్ల చాలా మంది విద్యార్థులు చదువులకు దూరమై తల్లిదండ్రులతో కలిసి వలసలు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో పేద విద్యార్థులు అధికంగా ఉన్నారని గతంలో హాస్టల్ ఉండడంతో వారి చదువుకు ఎలాంటి డోకా ఉండేది కాదన్నారు. నేడు హాస్టల్ లేక విద్యార్థులు ఇబ్బందులు పడ్తున్నారని, కొందరు బడులు మానేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే హాస్టల్‌ను తిరిగి ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

తల్లికి తిర'కాసు'!

- ఒక్కో విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని టీడీపీ హామీ
- ఫీజులు చెల్లించాలని ఒత్తిడి తెస్తున్న ప్రైవేటు పాఠశాలలు
- ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్న తల్లులు
- నియోజకవర్గంలో 310 పాఠశాలలు, 30 వేలకు పైగా విద్యార్థులు



టీడీపీ మేనిఫెస్టోలో ఒక్కో విద్యార్థికి రూ.15వేలు ఇస్తామని స్పష్టంగా పేర్కొన్న దృశ్యం



Scheme	Description
TALLIKI VANDANAM	As a part of Government Assured Flagship Programs, the Government under "TALLIKI VANDANAM" scheme is providing financial assistance of Rs.15,000/- per annum to each mother or recognized guardian who is below poverty line household and sending their children to schools/colleges i.e., from Classes I to XII.
STUDENT KITS	Under Vidya Kanuka, the Government school students of Classes I to XII are provided with the following benefits: (i) Bilingual Textbooks (English content on one page and Telugu version on the opposite page) (ii) Notebooks and Workbooks (iii) Three pairs of Uniforms with stitching charges (iv) A pair of Shoes and two pairs of Socks (v) A Belt and a School Bag

ప్రభుత్వం జారీ చేసిన జీఓలో తల్లికి రూ.15వేలు మాత్రమేనని పేర్కొన్న దృశ్యం

ఆలూరు రూరల్: పేదల విద్యను ప్రోత్సహించేందుకు తల్లికి వందనం పథకం కింద ప్రతి పాఠశాల విద్యార్థికి ఏడాదికి రూ.15,000 చొప్పున అందిస్తాం. ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అందరికీ ఈ పథకాన్ని వర్తింపజేస్తాం. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రధాన హామీ ఇది.

బడులు తెరిచి నెల రోజులు అవుతున్నా తల్లికి వందనం సాయం కోసం తల్లిదండ్రులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఆలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 310 పాఠశాలలు ఉండగా..ఇందులో 30 వేలకు పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు.

పేద కుటుంబాలకు బాసటగా నిలిచిన వైఎస్ జగన్

గతంలో పేద కుటుంబాలు తమ పిల్లలను చదివించాలంటే ఇబ్బంది పడేవారు. కొందరు మధ్యలో చదువు మాన్పించేసి పిల్లలను పనులకు పంపేవారు. పేదల విద్యకు అధిక ప్రాధాన్యతనిచ్చిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమ్మ ఒడి పథకం ప్రవేశపెట్టి అమలు చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఏడాదికి రూ.15 వేలు చొప్పున అందిస్తూ వచ్చారు. డ్రాపవుట్స్ సమస్యకు చెక్ పెట్టారు. ప్రతి తల్లి తన పిల్లలను బడికి పంపించేలా ప్రోత్సహించారు. అమ్మ ఒడి సాయాన్ని ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులు ఫీజులు అవసరాల కోసం వినియోగించుకోగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల తల్లులు తమ పిల్లల భవిష్యత్తు అవసరాల కోసం వెచ్చించేవారు.

ఒక్కొకరికీ రూ.15 వేలు చొప్పున ఇస్తామని హామీ..

నియోజకవర్గంలో 1వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు 30 వేలకు పైగా విద్యార్థులు ఉన్నారు. ఇంకా అడ్మిషన్లు జరుగుతున్నందున విద్యార్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. వీరిలో 70 శాతం మంది పేదలు ఉంటారని అంచనా. ఒక ఇంట్లో చదువుకునే పిల్లలు ఎంతమంది ఉంటే అంతమందికి తల్లికి వందనం పథకం కింద సాయం అందిస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. అయితే పాఠశాలలు తెరిచి నెల రోజులు కావస్తున్నా.. తల్లి వందనం విధివిధానాల పేరుతో జీఓ విడుదల చేసినా సరైన స్పష్టత లేదు. రెక్కలు ముక్కలు చేసుకుని ప్రైవేట్ పాఠశాలల్లో తమ పిల్లలను చదివించే పేద వర్గాలకు ఈ సాయం ఎంతో ఆసరాగా ఉంటుంది. త్వరితగతిన తల్లికి వందనం సాయం విడుదలకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆలూరు: అధికారం కోసం ఎన్ని అబద్ధాలైనా చెప్పి గద్దెనెక్కి మోసగించడం టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబునాయుడు మాత్రమే చెల్లుతుందని మరోసారి రుజువైంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా.. కుటుంబంలో ఎంత మంది చదవుకునే విద్యార్థులున్నా ఒక్కొక్కరికి ఏడాదికి రూ.15 వేల చొప్పున అందిస్తామని ప్రకటించారు. తప్పనిసరిగా హామీలను అమలు చేస్తామని నమ్మబలికారు. అయితే గద్దెనెక్కిన తర్వాత మాట మార్చారు. రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 13న పాఠశాలలు ప్రారంభంకాగా ఇప్పటివరకు తల్లికి వందనం పథకం అమలు కాలేదు. తాజాగా తల్లికి రూ.15 వేలు మాత్రమే ఇస్తామని ప్రభుత్వం జీఓ విడుదల చేసింది. గద్దెనెక్కిన నెలరోజుల్లోనే ఇంత దారుణంగా మోసగిస్తారా అని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సాయం కోసం ఎదురు చూస్తున్నాం



మా ఇద్దరు పిల్లలను ప్రైవేటు పాఠశాలలో చదివిస్తున్నాం. పాఠశాలలు ప్రారంభమై నెల రోజులు అవుతుండడంతో ఫీజులు చెల్లించాలని యాజమాన్యాలు మాపై ఒత్తి డి చేస్తున్నాయి. తల్లికి వందనం కింద రూ.30 వేలు ఎప్పుడు మా ఖాతాల్లోకి జమ అవుతాయోనని ఎదురు చూస్తున్నాం. గతంలో వచ్చే నగదుతో పిల్లలకు యూనిఫాం, పుస్తకాల కోసం ఖర్చు చేసేవాళ్లం. ఈ ఏడాది ఇంత వరకు నగదు జమ కాలేదు. ఏం చేయాలో తెలియక ఆయోమయంలో ఉన్నాం.

– సంధ్య, మొలగవల్లి, గ్రామం,

దగా చేస్తారనుకోలేదు



కూటమి ప్రభుత్వం ఇంత దారుణంగా మోసగిస్తుందని ఊహించలేదు. మా ఇంట్లో ముగ్గురు చిన్నారులు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. ఒక్కొక్కరికి తల్లికి వందనం పథకం కింద రూ.45 వేలు వస్తాయని, పిల్లల చదువుకు భారం ఉండదని భావించాం. ఇప్పుడేమో రూ.15 వేలు మాత్రామే ఇస్తారంటున్నారు. ఎన్నికల ముందు స్పష్టంగా హామీ ఇచ్చిన చంద్రబాబు ఇప్పుడు నెల రోజుల్లోనే ఇలా దగా చేస్తారనుకోలేదు.

– భాగ్యమ్మ ఆలూరు గ్రామం

ప్రభుత్వం మాట నిలుపుకోవాలి



మాది మద్దికెర మండలం బసినేపల్లి గ్రామం. మాకు ముగ్గురు పిల్లలు. ఆరు, రెండు, ఒకటో తరగతి చదువుతున్నారు. టీడీపీ నాయకులు ఎన్నికల ముందు తల్లికి వందనం పథకం పేరుతో ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి ఇస్తామని చెప్పారు. ఇప్పుడు చూస్తే ఒక్కరికి మాత్రమే ఇస్తామని చెప్పడం ఎంతవరకు సమంజసం. ముగ్గురికి రూ.45 వేలు వస్తే పిల్లల ఫీజులు తదితర ఖర్చులకు ఇబ్బందులు తప్పుతాయనుకున్నాం. గతంలో మాదిరిగానే ఇస్తామనడం సరికాదు. ప్రభుత్వం మాట నిలుపుకోవాలి.

– అరుణమ్మ, బసినేపల్లి , మద్దికెర మండలం.

వారి హామీతోనే పిల్లలను ప్రైవేట్ బడిలో చేర్పించా



నాకు కొడుకు, కూతురు ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు.ఎన్నికల సమయంలో తల్లికి వందనం పథకం కింద ఎంత మంది పిల్లలు చదువుతుంటే అంతమందికి రూ.15 వేల చొప్పున ఇస్తారని టీడీపీ నాయకులు చెప్పారు. వారి మాటలు నమ్మి ఇద్దరినీ ప్రైవేటు పాఠశాలలో చేర్పించా.ఇద్దరికీ రూ.30 వేలకు పైగా ఫీజులు అయ్యాయి. ఇప్పుడేమో రూ.15 వేలు మాత్రమే ఇస్తారని చెబుతున్నారు. ఇచ్చిన మాటను నిలుపుకోవాలి.

– జయలక్ష్మి, రామాపురం

మాట తప్పడం సరికాదు



నా భర్త ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పిల్లలు తహీదా 2వ తరగతి, లబీబ్ 1వ తరగతి పత్తికొండలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో చదివిస్తున్నాం. పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, స్కూల్ ఫీజులు, రవాణాచార్జీలన్నీ కలిపి ఏడాదికి సుమారు రూ.40 వేల వరకు ఖర్చవుతుంది. తల్లికి వందనం కింద ఇద్దరికీ రూ.30వేలు ప్రభుత్వం అందజేస్తే పిల్లల చదువులకు ఢోకా ఉండదని భావించాం. పాఠశాలలో ఫీజులు చెల్లించాలని యాజమాన్యం ఒత్తిడి చేస్తుంది. ఇప్పుడు ప్రభుత్వం మాట తప్పడం సరికాదు.

– ముబీనా, పత్తికొండ

ఫీజు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారు



తల్లికి వందనం కింద ఒక్కొక్క విద్యార్థికి రూ.15 వేలు చొప్పున ఇస్తామని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. ఆ డబ్బుల కోసం ఎదురు చూస్తున్నాం. నా కూతురు శ్రావణి 6వ తరగతి, కుమారుడు మురళి 3వ తరగతి ఆస్పరిలోని విజేత ప్రైవేట్ పాఠశాలలో చదువుచున్నారు. పాఠశాలలు ప్రారరంభమై నెల రోజులు కావస్తున్నా ప్రభుత్వం తల్లికి వందనం డబ్బులు జమ చేయలేదు. ఫీజు చెల్లించాలని పాఠశాల యాజమాన్యం ఒత్తిడి చేస్తోంది. మేము ఫీజులు చెల్లించలేని పరిస్థితిలో ఉన్నాం. ప్రభుత్వం వెంటనే ఇద్దరు పిల్లలకు రూ.30 వేలు జమచేయాలి. – రామాంజినమ్మ, చిరుమాన్‌దొడ్డి గ్రామం, ఆస్పరి మండలం

చంద్రబాబును నమ్మి మోసపోయాం



నాకు ఒక కుమారుడు, ఒక కుమార్తె సంతానం. ఇద్దరూ ప్రయివేట్ స్కూల్‌లో చదువుకుంటున్నారు. చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో టీడీపీ అధికారంలోకి వస్తే తల్లికి వందనం పేరుతో రూ.15 వేలు చొప్పున కుటుంబంలో ఎంత మంది ఉంటే అంతమంది విద్యార్థులకు డబ్బులు జమ చేస్తామని చెప్పడంతో సంబరపడ్డాం. నేడు కేవలం తల్లికి రూ.15 వేలు మాత్రమే జమ చేస్తానని చెప్పడం విడ్డూరంగా ఉంది. మేము కూలీ పని చేసుకుంటూ పిల్లలను చదివించుకుంటున్నాం. ఇప్పుడు ప్రభుత్వం మాట మార్చడంతో ఫీజులెలా చెల్లించాలి. చంద్రబాబును నమ్మి మోసపోయాం.

– ఇందిరమ్మ, నిట్రవట్టి గ్రామం

మాట నిలుపుకోవాలి



నాకు ఒక కొడుకు, ముగ్గురు ఆడపిల్లలున్నారు. వారిలో ఇద్దరు హొళగుంద జెడ్పీ హైస్కూల్లో చదువుకుంటున్నారు. ఎలాంటి భూమి లేదు. కూలి చేసుకుని బతుకుతున్నాం. ప్రభుత్వం పిల్లల చదువుకు బ్యాగులు, పుస్తకాలు, యూనిఫాం అన్ని ఇచ్చి ఒక్కొక్కరికీ రూ.15 వేలు ప్రకారం ఇస్తానని చెప్పింది. ఈ ప్రకారం ఇద్దరు పిల్లలకు రూ.30 వేలు ఎప్పుడిస్తారా అని ఎదురు చూస్తున్నా. ఈ డబ్బు పిల్లల అవసరాలకు ఆసరాగా ఉంటుందని ఆశ. ఇప్పుడు ఒక్కరికి మాత్రమే ఇస్తారని చెప్పడంతో ఆందోళన కలుగుతుంది. ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలి.

– సమ్మతగేరి భాగ్యమ్మ, హొళగుంద

కేడీసీఎంఎస్ స్థలంలోని బంకుల తొలగింపు



ప్రొక్లెయినర్‌తో బంకులను తొలగిస్తున్న అధికారులు

ఆలూరు రూరల్: జిల్లా జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఆదేశాల మేరకు ఆర్టీసీ బస్టాండు పక్కన ఉన్న కేడీసీఎంఎస్ (కర్నూలు డిస్ట్రిక్ కో–ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ) గోదాముల ఆవరణలో అక్రమంగా నిర్మించిన బంకులను కేడీసీఎంఎస్ జిల్లా మేనేజర్ రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత రెండేళ్లుగా కేడీసీఎంఎస్ ఆవరణలో కొంత మంది స్థలం ఆక్రమించుకుని బంకులను ఏర్పాటు చేసుకున్నారని చెప్పారు. బంకులు తొలగించాలని ఏడాది క్రితం నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. కేడీసీఎంఎస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన జేసీ నారపురెడ్డి మౌర్య అక్రమణలను తొలగించాలని తాజాగా ఉత్తర్వులు జారీ చేయడంతో రెవెన్యూ, పోలీసు అధికారుల సమక్షంలో ప్రొక్లెయినర్‌తో బంకులను తొలగించామన్నారు. ఇకపై ఎవరైనా కేడీసీఎంఎస్ స్థలాల్లో బంకులు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుంటామని హెచ్చరించారు. ఎస్‌ఐ ఓబులేసు, ఆర్‌ఐ బసవన్న గౌడ్, ఆలూరు కేడీసీఎంఎస్ అధికారులు ప్రకాష్, కరుణాకర్ సిబ్బంది ఉన్నారు.

తాత్కాలిక కంచె ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్



చెట్ల కొమ్మలను అడ్డుగా వేసి కంచె ఏర్పాటు చేసిన దృశ్యం

చిప్పగిరి: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు నిలిచిపోవడం అక్కడ ఉంచిన రాళ్లు, కడ్డీలు, పునాది కోసం తవ్విన గుంతలు ప్రమాదకరంగా మారాయి. విద్యార్థులు అటువైపే ఆడుకుంటుండడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందేవారు. దీనిపై గురువారం 'సాక్షి' దినపత్రికలో 'పనులు నిలిచి.. ముప్పు పొంచి' శీర్షికన వార్త ప్రచురితం అయ్యింది. దీనిపై స్పందించిన పాఠశాల సిబ్బంది శుక్రవారం తగు చర్యలు చేపట్టారు. విద్యార్థులు అటువైపు వెళ్లకుండా పునాది గుంతల చుట్టూ చెట్ల కొమ్మలు వేసి తాత్కాలిక కంచె ఏర్పాటు చేశారు. అక్కడున్న రాళ్లను తొలగించారు. ప్రమాదం ముప్పు తొలగిపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

శాంతిభద్రలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు



తొగర్చేడులో గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ బీవీ మధుసూదన్

కృష్ణగిరి: గ్రామాల్లో శాంతిభద్రలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ బీవీ మధుసూదన్ హెచ్చరించారు. మండలంలోని తొగర్చేడు గ్రామంలో గురువారం సాయంత్రం ఎస్‌ఐ ఖాజావలితో కలిసి గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామంలో అల్లర్లు, హింసాత్మక సంఘటనలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. ఎన్నికల వరకే పార్టీలని, ఆ తర్వాత ఏ పార్టీ గెలిచినా, ఓడినా అందరూ సమన్వయంతో నడవాలని సూచించారు. కొందరు అనవసరంగా దాడులకు పాల్పడటం, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తే చర్యలు కఠినంగా ఉంటాయని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో బైండోవర్ చేసిన వారు మళ్లీ తప్పు చేస్తే ష్యూరిటీ ప్రకారం జరిమానా విధిస్తామని తెలిపారు. పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని, అందరు ఐకమత్యంగా ఉండి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

అద్దె చెల్లించకుంటే షాపులు సీజ్ చేస్తాం



షాపుల నిర్వాహకులతో మాట్లాడుతున్న డీఎస్‌ఓ భూపతిరావు

ఆలూరు రూరల్: స్టేడియం పరిధిలోని కాంప్లెక్స్‌లో షాపులు నిర్వహించుకుంటూ అద్దె చెల్లించని వారిపై చర్యలు తీసుకుంటామని, షాపులను సీజ్ చేసి రీటెండర్ వేస్తామని జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ భూపతిరావు అన్నారు. ఆయన గురువారం ఎల్లార్తి రోడ్డులోని స్టేడియం కాంప్లెక్స్‌ను పరిశీలించారు. బాడుగ చెల్లించని షాపుల యజమానులతో మాట్లాడారు. పెండింగ్ బకాయిలు చెల్లించాలన్నారు. వారంలోపు అద్దె చెల్లించని షాపులను సీజ్ చేసి తిరిగి వేలం వేస్తామన్నారు. అలాగే వేలంలో షాపులు దక్కించుకున్న వారే దుకాణాలు నిర్వహించుకోవాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల మైదానంలో క్రీడాకారుల విశ్రాంతి భవనాన్ని పరిశీలించారు. ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో గదుల కొరత వల్ల 2020లో అప్పటి జిల్లా కలెక్టర్ వీరపాండియన్ స్టేడియం పరిధి పెవిలియన్ భవనంలోని నాలుగు గదులను ఐటీఐ విద్యార్థులకు క్లాసులు నిర్వహించేందుకు ఆదేశాలు ఇచ్చారన్నారు. అలాగే ప్రతి నెలా రూ.2 వేలు చెల్లించాలని అప్పట్లో ఉత్తర్వులిచ్చినా డీఎస్‌ఓ అధికారులకు చెల్లించలేదని చెప్పారు. ఈ విషయమై ఐటీఐ కళాశాల అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అద్దె చెల్లించాలని సూచించారు. అలాగే స్థానిక ఇండోర్ స్టేడియం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. జిమ్‌లో మరమ్మతులకు గురైన పరికరాలను బాగు చేస్తామని చెప్పారు. అలాగే స్టేడియంలో కోచ్ పోస్టు భర్తీకి చర్యలు తీసుకుంటామన్నారు.

తహసీల్దారు కార్యాలయంలో పడిగాపులు



వివిధ పనుల నిమిత్తం హొళగుంద తహసీల్దారు కార్యాలయానికి వచ్చిన ప్రజలు

హొళగుంద: వివిధ పనుల నిమిత్తం గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయానికి వచ్చిన ప్రజలు గంటలతరబడి పడిగాపులు కాయాల్సి వచ్చింది. తహసీల్దారు ప్రసాద్‌రాజు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వీఆర్‌ఓలతో సమావేశం పెట్టుకున్నారు. దీంతో పల్లెలు, ఇతర దూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆదాయ, కుల ఇతర సర్టిఫికెట్ల కోసం వస్తే కార్యాలయంలో ఎవరూ పట్టించుకోవడం లేదని చాలామంది వాపోయారు. తహసీల్దారు, ఇతర సిబ్బంది పనులు చేయడం లేదని, అనవసరంగా తిప్పుకుంటున్నారని వాపోయారు. కార్యాలయంలో ఒక్కో పనికి ఒక్కో రేటు పెట్టి డిమాండ్ చేస్తున్నారని, అందరినీ గాడిలో పెట్టాల్సిన అధికారులే నాకేమిటి అనే ధోరణిలో ఉంటున్నారని వాపోతున్నారు. విద్యార్థులు, సంక్షేమ పథకాల లబ్ధిదారులకు అవసరమైన సర్టిఫికెట్ల కోసం గురువారం ప్రజలు పెద్ద ఎత్తున రావడంతో కార్యాలయం కిటకిటలాడింది. గంటల తరబడి వేచి చూసినా తమకు సంతకాలు చేసేందుకు కూడా అధికారులు విసుక్కుంటున్నారని ఇదేమి పద్ధతి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక అధికారి క్యాస్ట్, ఇన్‌కం సర్టిఫికెట్ల ఎక్కువ మందిని పంపుతున్నారని మీ సేవ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు సమస్యలను పరిష్కరించాలని, అనవసరంగా తిప్పుకోకుండా ధ్రువపత్రాలు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పాడి పశువులకు టీకాలు

ఆలూరు: పాడి పశువులు వ్యాధుల బారిన పడకుండా టీకాలు వేయించాలని పశువైద్యాధికారులు సూచించారు. ఆలూరు పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ సి.విక్టర్‌బాబు ఆదేశాల మేరకు గురువారం వెటర్నరీ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు ఆలూరులో పాడిపశువులకు ఉచితంగా టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పాడిరైతులు తమ గేదెలు, ఆవులు, మేకలు, గొర్రెలు వంటి వాటికి టీకాలు వేయించి వ్యాధుల నుంచి రక్షించుకోవాలన్నారు. పశు వైద్యశాలకు వచ్చే రైతులు ఆధార్‌కార్డును వెంట తీసుకు రావాలని సూచించారు.

పీర్ల పెట్టె ఊరేగింపు

తుగ్గలి : మొహర్రం ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి తుగ్గలితో పాటు పలు గ్రామాల్లో పీర్ల పెట్టెను భక్తి శ్రద్ధలతో ఊరేగించారు. పూలతో అలంకరించిన పెట్టెలో పీర్లను ఉంచి మేళతాళాలు, తప్పెట్లతో పీర్ల చావిళ్ల నుంచి వీధుల్లో ఊరేగించారు. అనంతరం మకానాల్లో పీర్లను కొలువుదీర్చారు.

కుటుంబ నియంత్రణతో దేశాభివృద్ధి



తుగ్గలిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తుగ్గలి : ప్రతి ఒక్కరూ కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటిస్తేనే దేశ పురోగతి సాధ్యమని తుగ్గలి వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం తుగ్గలిలో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధిక జనాభాతో అనేక సమస్యలు తలెత్తుతాయన్నారు. ముఖ్యంగా ఆహార, తాగునీటి కొరత, ఆరోగ్య సమస్యలు తలెత్తి ఆర్థికవృద్ధి మందగిస్తుందన్నారు. జనాభా నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక


వడ్డె జయసుధ


జె చైతన్య


కె హారిక

వెల్దుర్తి(కృష్ణగిరి): ఈ ఏడాది ఏప్రిల్‌లో వెలువడిన పదవ తరగతి ఫలితాల్లో వెల్దుర్తి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన ఇద్దరు, స్థానిక జ్యోతిబా పూలే బీసీ బాలికల గురుకులంలో చదివిన విద్యార్థిని బుధవారం ప్రభుత్వం విడుదల చేసిన ట్రిపుల్ ఐటీ కాలేజీలకు ఎంపికయ్యారు. బాలికల హైస్కూల్‌లో 583 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచిన వడ్డె జయసుధ, 573 మార్కులతో మూడవ స్థానంలో నిలిచిన కె.హారిక ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపిక కాగా, జ్యోతిబా పూలే గురుకులంలో 578 మార్కులతో మండలంలో రెండవ స్థానంలో నిలిచిన జె.చైతన్య నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. తమ విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికవడం పట్ల ఎంఈఓలు ఇందిర, రమేశ్, బాలికల హైస్కూల్ హెచ్‌ఎం చంద్రావతి, గురుకులం ప్రిన్స్‌పాల్ షబానా, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేసి విద్యార్థులను అభినందించారు.

ప్రశాంత జీవనం గడపాలి



నిట్రవట్టిలో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్‌ఐ నరేంద్ర

హాలహర్వి: గ్రామాల్లోని ప్రజలు అల్లర్లు, గొడవలకు వెళ్లకుండా ప్రశాంతమైన జీవనాన్ని గడపాలని హాలహర్వి మండల ఎస్‌ఐ నరేంద్ర సూచించారు. ఈ మేరకు గురువారం రాత్రి మండలంలోని నిట్రవట్టి గ్రామంలో ఆయన పల్లెనిద్ర కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రజలతో సమావేశమై మాట్లాడారు. చిన్న చిన్న విషయాలకు గొడవలు పడి పోలీస్‌స్టేషన్, కోర్టుల చుట్టూ తిరుగుతూ జీవితాలను నాశనం చేసుకోరాదన్నారు. సమస్యలను సామరస్యంగా పెద్దల సమక్షంలో పరిష్కరించుకోవాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురవాలని సూచించారు. పిల్లలను చదివించడంలో, ఆర్థికంగా రాణించడంలోనూ పోటీ పడాలన్నారు. ఈయన వెంట పోలీసులు ఉన్నారు.

పచ్చదనం.. ప్రశాంతత



ఆలూరు కోయనగర్‌కాలనీలో ఏపుగా పెరిగిన చెట్లు

ఆలూరు: నియోజకవర్గ కేంద్రమైన ఆలూరులోని కోయ నగర్ కాలనీలో పచ్చని చెట్లతో హరిత వనంలా కళకళలాడుతోంది. కాలనీలోని జంగాలవీధి, మిలటరీ ప్రసాద్ వీధి, పీర్లచావిడి తదితర ప్రాంతాలలో ప్రజలు తమ ఇళ్ల ముందు వివిధ రకాల మొక్కలను పెంచుకోవడంతో అవి పెరిగి భారీ వృక్షాలు మారాయి. రోడ్డుపై ఎండ కూడా పడనంతగా చెట్లు పెరగడం, కాలనీలో సీసీ రోడ్లు వేయడంతో ప్రజలు, ఆ ప్రాంతానికి వచ్చిన బంధువులు హరిత వనాన్ని చూసి ఆహా.. ఎంత హాయ్‌గా ఉందిలే అంటూ సేద తీరుతున్నారు. పచ్చని చెట్ల నీడలో ప్రశాంతంగా ఉంటుందని కాలనీవాసులు చెబుతున్నారు.